క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని వీడేది లేదు



సత్తెనపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని వీడేది లేదని పట్టణంలోని 21వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దండెబోయిన జగన్నాథం అన్నారు. ఇటీవల కొందరు మధ్యవర్తుల మాటలతో ఆయన టీడీపీలో చేరారు. చేరిన ఒక్కరోజులోనే పునరాలోచించుకొని ఆ పార్టీకి గుడ్‌ బై చెప్పి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో తిరిగి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి ఆయనను సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌ పట్టణ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు, ట్రేడ్‌ యూనియన్‌ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు



అమరావతి: స్థానిక గాజులపాలెంకు చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్‌ ముస్తఫా వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాయలంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌ నేతృత్వంలో ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోట హరిబాబు, నంబూరు బాబురావు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, సల్మాన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడికి సత్కారం



సత్తెనపల్లి: ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడిగా ఇటీవల నూతనంగా ఎన్నికైన మద్ది వెంకటేశ్వరరావును రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యులను అందరినీ కలుపుకొని సంఘ పటిష్టతకు ఐక్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పెండెం బాబురావు, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ రమావత్‌ కోటేశ్వరరావు నాయక్‌, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వెలుగూరి శరత్‌, జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్‌, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్‌ మౌలాలి, ఎస్సీ సెల్‌ రాష్ట్ర నాయకుడు కోడిరెక్క దేవదాస్‌, జమిలి రాధాకృష్ణమూర్తి, తదితరులున్నారు.

ప్రారంభమైన సత్తెమ్మతల్లి మాలధారణ



అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని స్వయంభు సత్తెమ్మతల్లి మాలధారణ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు 20వ తేదీ వరకు కొనసాగుతాయని అమ్మవారి మాలధారణ గురుస్వామి యర్రంశెట్టి శ్రీనివాసరావుస్వామి తెలిపారు. గత 8 సంవత్సరాలుగా ప్రతి ఏటా మాలధారణ నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 1న చండీయాగం నిర్వహించి దేవస్థానం వద్ద సత్తెమ్మతల్లి, సత్యదేవుల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరారు.

మైనర్‌ బాలికను వేధిస్తున్న యువకునిపై కేసు

నకరికల్లు: మైనర్‌ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏ బాలకృష్ణ బుధవారం తెలిపారు. నకరికల్లులోని మైనర్‌ బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడు గత ఏడాదికాలంగా ఫోన్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు, సంభాషణలు చేస్తున్నాడు. అతని వేధింపులు తాళలేక బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహమే లక్ష్యం

- హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు
- మట్టిలో మాణిక్యాలను వెలికితీయడమే లక్ష్యం



కబడ్డీ ఆడుతున్న అమరావతి, వైకుంఠపురం జట్లు

అమరావతి: నైపుణ్యం ఉండి తగిన ప్రోత్సాహం లేని గ్రామాలలో ఉన్న మట్టిలోని మాణిక్యాల్లాంటి క్రీడాకారులను వెలికి తీసి ప్రోత్సహించటమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక రామకృష్ణ హిందూ హైస్కూల్‌ ఆవరణలో, ధరణికోట గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్రా ఆటలపోటీలను ఎంపీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి గ్రామాలలో ఉన్న యువకులకు గుర్తింపు తీసుకువచ్చి వారికి ఉజ్వల భవిష్యత్‌ కల్పించటానికి ఆడుతాం ఆంధ్రా ఆటలపోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఆటలపోటీలలో విజేతలకు బహుమతులు ఇవ్వటమే కాకుండా రాష్ట్రస్థాయిలో గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడాకారులను ఎంపీపీ పరిచయం చేసుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాధర శ్రీనివాస్‌ మాట్లాడుతూ 47 రోజుల పాటు ఐదు దశల్లో సాగే ఈ పోటీలలో ప్రస్తుతం సచివాలయ స్థాయి పోటీలు పూర్తయ్యాయన్నారు. గత వారం రోజులుగా మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మరో రెండు రోజులలో మండల స్థాయి విజేతలను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విజయకుమార్‌, శివశంకర్‌, పలువురు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్థానిక జిల్లాపరిషత్‌ ఉన్నతపాఠశాలలో క్రికెట్‌ ఆడుతున్న క్రీడాకారులు

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్రా క్రికెట్‌ పోటీలు

అచ్చంపేట: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్‌ హైస్కూలు ఆవరణలో బుధవారం క్రికెట్‌ పోటీలు రసవత్తరంగా జరిగాయి. అచ్చంపేట2–వేల్పూరు2 మ్యాచ్‌ని సర్పంచ్‌ టాస్‌వేసి ప్రారంభించారు. వేల్పూరు2పై అచ్చంపేట2 జట్టు విజయం సాధించింది. అచ్చంపేట1, కస్తల1 జట్లపై జరిగిన పోటీలో అచ్చంపేట1 విజయం సాధించింది. తాళ్లచెరువు–కోనూరు జట్ల మధ్య జరిగిన పోటీలో కోనూరు విజయం సాధించింది. ఓర్వకల్లు– చల్లగరిగ గ్రామాల మధ్య జరిగిన పోటీలో చల్లగరిగ టీము విజయం సాధించింది.

మండలస్థాయి క్రికెట్‌ పోటీలు ప్రారంభం

నకరికల్లు: క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత ఏర్పడుతుందని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల స్థాయి క్రికెట్‌ పోటీలు స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామ స్థాయిలో నిర్వహించిన క్రికెట్‌ పోటీల్లో మండల స్థాయికి 14 జట్లు ఎంపికయ్యాయి. ఎంపికైన జట్ల మధ్య పోటీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఎంతో ఆసక్తిగా క్రీడాస్ఫూర్తితో ఆడుతున్నట్లు తెలిపారు. లీగ్‌రూపంలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని మండల స్థాయిలో ప్రతిభను చాటిన జట్టును నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీ చింతా పుల్లయ్య, పలువురు క్రీడా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉండరాదు

- పల్నాడు జిల్లా మలేరియ అధికారి రవీంద్ర రత్నాకర్
- 14వ సచివాలయ పరిధిలో ఇంటింటికి అవగాహన



వెంగళరెడ్డినగర్‌లో ఇంటింటికి దోమలపై అవగాహన కల్పిస్తున్న రవీంద్ర రత్నాకర్

సత్తెనపల్లి: ఇంటి లోపల, ఇంటి బయట పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్‌ అన్నారు. పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14వ సచివాలయం వెంగళరెడ్డి నగర్‌లో వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలకు దోమల వలన వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు దోమలకు పుట్టినిల్లు అని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వలన కీటక జనిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు వీటి వలన అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. దోమల నివారణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి బీపీ చంద్రశేఖర్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ వై.రాజేష్‌పాల్‌, హెల్త్‌ అసిస్టెంట్లు, హెల్త్‌ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, తదితరులున్నారు.

మరపురాని జ్ఞాపకాలతో..



పదో తరగతి పూర్వ విద్యార్థులు

- పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక
- 33 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

పెదకూరపాడు: పెదకూరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. మూడు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులందరు ఆనందంగా తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు.

చిన్ననాటి సంఘటనలు, అనుభూతులు నెమరేసుకున్నారు. సరదా కబుర్లతో ఆటపాటలతో సందడి చేశారు. అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. తమతోపాటు చదువుకున్న మృతిచెందిన విద్యార్థులు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సంతాపం తెలిపారు. పూర్వ విద్యార్థులంతా ఒక కమిటీగా ఏర్పడి పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు రమణకు తెలిపారు. గురువులకు విద్యార్థులు భోజనం వడ్డించడం ప్రత్యేకంగా నిలిచింది.

వైభవంగా పునీత ఆంతోని చర్చి తిరునాళ్ళ



తురకపాలెంలోని చర్చిలో సామూహిక పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న విచారణ గురువులు

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలో పునీత ఆంతోని చర్చి వార్షిక తిరునాళ్ళ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తిరునాళ్ళలో భాగంగా చర్చిని విద్యుత్‌ దీపాలతో అందంగా అలంకరించారు. పలు ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులంతా తిరునాళ్ళకు సొంత గ్రామానికి వచ్చి ఘనంగా జరుపుకుంటారు. తిరునాళ్ళలో ఉదయం 5 గంటలకు చర్చిలో ఆలయ విచారణ గురువులు నాగోతు చిన్నయ్య ఆధ్వర్యంలో దివ్య పూజ నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం సమిష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు పుట్టి సుందరరాజు, జోజి రాయన్న, మల్లవరపు సుందరబాబు, పుట్టి ఆంథో నిరాజులతో పాటు మరో 30 మంది గురువులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి కొవ్వొత్తుల సమర్పణ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి బాణసంచాతో గ్రామంలో తేరు ఊరేగింపు నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌ మల్లవరపు చంద్రశేఖర్‌ప్రతాప్‌ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు బహుమతులు అందించారు.

మినీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: టైర్‌ పగిలి మినీ ఆటో అదుపు తప్పి వ్యక్తిని ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని పోలీస్‌ స్టేషన్‌ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఘటనకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ పఠాన్‌ రబ్బానీ ఖాన్‌ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని గురజాలకు చెందిన చొప్పవరపు సత్యనారాయణ(53) అమృత టిఫిన్‌ సెంటర్‌ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా దాచేపల్లి నుంచి కొండమోడు వైపు మిర్చి లోడుతో వెళ్తున్న ఆటో టైర్‌ పగలటంతో అదుపు తప్పి సత్యనారాయణను ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని ఇరుకుపాలెం సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాదల గ్రామానికి చెందిన శాసనాల విజయ్‌ ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి వైపు వెళుతుండగా, ఇరుకుపాలెం సమీపంలోని మదర్సా వద్ద నరసరావుపేట వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహన దారుడు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్‌ తలకు తీవ్ర గాయమవటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనం ప్రమాద స్థలంలోనే వదిలేసి వెళ్లటంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జరిగిన ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై డి.కిశోర్‌బాబు తెలిపారు.

ట్రాక్టర్‌ డ్రైవర్‌కు ఆరు నెలలు జైలు శిక్ష

సత్తెనపల్లి/అమరావతి: మండల పరిధిలోని నెమలికల్లు–ఉంగుటూరు గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదానికి కారకుడైన బుల్లా అనిల్‌ బాబుకు ఆరు నెలల జైలు శిక్ష విధించారు. అతి వేగంగా, నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ నడిపి ఒకరి మృతికి కారకుడైన డ్రైవర్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు అపరాధ రుసుం విధిస్తూ సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి మహమ్మద్‌ గౌస్‌ బుధవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన బుల్లా అనిల్‌కుమార్‌ 2017 అక్టోబర్‌ 14న రోడ్డు నిర్మాణ పనుల కోసం సూపర్‌వైజర్‌గా వచ్చిన నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన వేమూరి మహేష్‌ను తన ట్రాక్టర్‌లో ఎక్కించుకొని నెమలికల్లు నుంచి ఉంగుటూరు వెళ్లే మార్గంలో ఒక మూల మలుపు వద్ద అతివేగంగా, నిర్లక్ష్యంగా అనిల్‌కుమార్‌ ట్రాక్టర్‌ నడపడంతో ట్రాక్టర్‌ బోల్తా పడి వేమూరి మహేష్‌పై ట్రాక్టర్‌ పడటంతో మరణించాడు. మహేష్‌ కుటుంబ సభ్యులు అమరావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి న్యాయస్థానంలో చార్జిషీట్‌ దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయమూర్తి ముద్దాయి బుల్లా అనిల్‌కుమార్‌కు సెక్షన్‌ 304 ఏ కింద ఆరు నెలలు, ఎంవీ యాక్ట్‌ 181 కింద మూడు నెలలు (ఏక కాలంగా ఆరు నెలలు) జైలు శిక్షను అనుభవించాలని, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసును ప్రాసిక్యూషన్‌ తరఫున ఏపీపీ వడితే ప్రసాద్‌ నాయక్‌ వాదించారు.

పంచాయతీల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ, పక్కన ఎంపీపీ షేక్‌ యలవర్తిపాటి జైబూన్‌బీ, తదితరులు



గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ హనుమంతరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పి.కోటయ్య

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజులపాటు శిక్షణ

సత్తెనపల్లి: పంచాయతీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని సత్తెనపల్లి ఎంపీపీ షేక్‌ యలవర్తిపాటి జైబూన్‌ బీ అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్‌ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్‌ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణా తరగతులకు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేసే నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందన్నారు. వీటి ఆధారంగానే పంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక డ్రాఫ్ట్‌, బ్లాక్‌ స్థాయి పంచాయతీ డెవలప్‌మెంట్‌ ప్లాన్‌ తదితర వాటిపై రెండు రోజుల పాటు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈవోపీఆర్డీ బి.దయాసాగర్‌, అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ బసవకుమారిలు మాట్లాడారు. రిసోర్స్‌ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్‌ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు, తదితరులున్నారు.

సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు శిక్షణ

క్రోసూరు: క్రోసూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు, సచివాలయ ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లకు, కార్యదర్శులకు రెండు రోజుల ఓరియెంటేషన్‌ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించగా ఎంపీడీవో బి.మహేష్‌, ఈవోపీఆర్డీ పి.శివరామయ్యలు పాల్గొని పంచాయతీ అభివృద్ధిపై సర్పంచ్‌ల, ఎంపీటీసీలు, అధికారుల బాధ్యతలను తెలియజెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి సర్పంచ్‌ తమ గ్రామ అభివృద్ధికి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా మిగతా సభ్యులతో కలిసి తీర్మానం చేసి తప్పక అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాలన్నీ పంచాయతీలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులకుందని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది

గ్రామ పంచాయతీ ప్రణాళిక తయారీపై దృష్టి పెట్టాలి

ముప్పాళ్ళ: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25లో భాగంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టితో పనిచేసి ప్రణాళిక తయారు చేయాలని ఎంపీడీవో పీ పుట్టారెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో జీపీడీపీ(గ్రామపంచాయతీప్రణాళిక)పై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన జీవనోపాధి లక్ష్యంగా ప్రణాళిక తయారు చేయాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన ఆయా అంశాల వారీగా అంచనాలు తయారు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, ఈఓపీఆర్డీ రూపవతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఆయా శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

అమరావతి: స్థానిక మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక శిక్షణా కార్యక్రమాన్ని అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌ రెడ్డి ప్రతి గ్రామంలో సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థను ప్రవేశ పెట్టడంతో ప్రజలకు పరిపాలన చేరువలోకి తీసుకువచ్చారన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు నేరుగా చేర్చటంలో ఈ వ్యవస్థలు ప్రధానపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ రెండు వ్యవస్థల ద్వారా రాష్ట్రం గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తుందన్నారు. సచివాలయాల సిబ్బంది శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.గంగాధర శ్రీనివాసన్‌, ఏవో ప్రతాప్‌, మండల పరిధిలోని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది, ఐసీడీఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న మండల స్థాయి సిబ్బంది

పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ

పెదకూరపాడు: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండలంలోని 20 గ్రామాల పంచాయతీ సిబ్బంది, గ్రామ సర్పంచ్‌లకు బుధవారం పెదకూరపాడు జెడ్పీ పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, ప్రజా ప్రణాళిక లక్ష్యాలు, గ్రామ పంచాయతీ కమిటీలు, గ్రామ సభల నిర్వహణ, బాల మహిళా సభల నిర్వహణ, తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరసింహారావు మాట్లాడుతూ గ్రామ సభల్లో నిర్ణయించిన తీర్మానాల ప్రకారం నిధులను సక్రమంగా ఖర్చు చేసేలా గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలన్నారు.

20వ తేదీన దేవరంపాడు దేవస్థానంలో వేలం

రాజుపాలెం: దేవరంపాడు కొండపై వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తిరునాళ్ల సందర్భంగా షాపుల వారికి వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్‌ 9వ తేదీ వరకు కొండపై తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతున్నందున కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, బియ్యం, బెల్లం, నెయ్యి, సేకరించుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. అదేవిధంగా ఏప్రిల్‌ 13వ తేదీ నుంచి ఏడాదిపాటు కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కు, నెయ్యి, బెల్లం, తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాటలు జనవరి 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు దేవస్థానం కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. సీల్డ్‌ టెండర్‌, బహిరంగ వేలం కూడా నిర్వహించబడతాయని తెలిపారు. వివరాల కోసం దేవస్థానం కార్యనిర్వహణ అధికారిని సంప్రదించాలని కోరారు.

హెల్త్‌ గ్రామ పంచాయతీపై జాతీయ వర్క్‌షాప్‌కు ఎంపీపీ

క్రోసూరు: కేంద్ర పంచాయతీరాజ్‌ శాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి తిరుపతిలో పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా హెల్త్‌ గ్రామ పంచాయతీ అంశంపై జరుగు జాతీయ వర్క్‌షాప్‌కు క్రోసూరు ఎంపీపీ పి.కోటయ్యకు ఆహ్వానం అందినట్లు ఎంపీడీవో బి.మహేష్‌ బుధవారం తెలిపారు. ఈ అంశంపై ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి సాధించుటలో సుపరిపాలన, ప్రజలకు సేవలు మంచిగా అందించుట తదితర అంశాలపై తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జాతీయ వర్క్‌షాప్‌ ఈనెల 20 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి మండలం నుంచి ఎంపీపీ హాజరవుతారని ఎంపీడీవో వివరించారు.

సంతోషంలో మొక్కజొన్న రైతులు

కారెంపూడి: మండలంలోని వేసిన మొక్కజొన్న పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం పైర్లు అన్నీ బాగా ఏపుగా పెరిగి కండె దశలో కనువిందు చేస్తున్నాయి. మరో నెల రోజులలోపే పంట చేతికి వస్తుంది. మొక్కజొన్న వేసిన రైతులు ఎకరాకు 40 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. మండలంలో 750 ఎకరాల దాకా మొక్కజొన్న వేశారని ఏఓ బి.యలమందారెడ్డి తెలిపారు. సీడ్‌ కోసం ముందుగానే కంపెనీలు క్వింటా రూ.2,800కు కొనే విధంగా ఒప్పందం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మొక్కజొన్న రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.